సాక్షి
నిజామాబాద్
శనివారం ၊ 26 ၊ జూలై ၊ 2025



ఏపీఎంల బదిలీలు పూర్తి
జిల్లాలోని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)లో పనిచేస్తున్న ఏపీఎంల బదిలీలు పూర్తయ్యాయి.

- 8లో ▸



బాధితులకు అండగా..
బాధిత మహిళలు, పిల్లలకు మెరుగైన సేవలు అందిస్తూ భరోసా కేంద్రం అండగా నిలుస్తోందని సీపీ సాయిచైతన్య అన్నారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.7 /22.6

వాతావరణం
ఉదయం శీతల గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

వరల్డ్ బాక్సింగ్ చాంపియన్ టోర్నీకి నిఖత్ జరీన్



నిజామాబాద్ నాగారం: అంతర్జాతీయ బాక్సింగ్ చాంపియన్ టోర్నీకి జిల్లాకు చెందిన నిఖత్ జరీన్ ఎంపికైంది. ఈ నెల 15 నుంచి 25 వరకు పంజాబ్ రాష్ట్రం పటియాలలో జరిగిన ప్రత్యేక శిక్షణ శిబిరంలో నిఖత్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. దీంతో ఆమెను 51 కేజీల విభాగంలో భారత జట్టుకు ఎంపిక చేశారు. సెప్టెంబర్ 4 నుంచి 14 వరకు ఇంగ్లాండ్ దేశంలోని లివర్‌పూల్ జరిగే టోర్నీలో పాల్గొననున్నారు.

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారిగా రాజీవ్ గాంధీ హనుమంతు



నిజామాబాద్ అర్బన్: ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారిగా రాజీవ్ గాంధీ హనుమంతును నియమిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రెటరీగా కొనసాగుతున్న ఆయన నిజామాబాద్ కలెక్టర్‌గా పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లారు. స్థానిక సంస్థలు ఎన్నికల నేపథ్యంలోనే రాజీవ్ గాంధీ హనుమంతును ఉమ్మడి జిల్లాకు కేటాయించినట్లు తెలిసింది. గతంలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలు నిర్వహించిన అనుభవం ఉండడంతో స్థానిక సంస్థల ఎన్నికలను కూడా పకడ్బందీగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారిగా నియమించినట్లు ఉన్నతాధికారులు తెలిపారు.

ఎస్సారెస్పీలోకి 5,208 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
బాల్కొండ: స్థానిక ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 5,208 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో ప్రాజెక్ట్ నీటిమట్టం క్రమంగా పెరుగుతుంది. ప్రాజెక్ట్ నుంచి కాకతీయ కాలువ ద్వారా 100, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 291 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం రాత్రికి 1069.00 (21.71 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

సాధారణ వర్షపాతమే
నిజామాబాద్ అర్బన్: జిల్లాలో రెండ్రోజుల పాటు కురిసిన వర్షంతో సాధారణ వర్షపాతం నమోదైంది. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా 10.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 22 మండలాల్లో సాధారణ, పది మండలాల్లో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా బోధన్ మండలంలో 25.5 మి.మీ, సాలూరలో 24.5 మి.మీ, చందూరులో 20.5 మి.మీ, నవీపేటలో 18.4 మి.మీల వర్షం కురిసింది.

27 యోగాసన క్రీడాకారుల ఎంపికలు
నిజామాబాద్‌నాగారం : జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 27న సుభాష్‌నగర్‌లోని దయానంద యోగా కేంద్రంలో యోగాసన ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు యోగారత్న, ఎక్కొండ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి టీ బాలశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 55 సంవత్సరాల పురుషులు, మహిళలకు వివిధ విభాగాల్లో ఎంపికలు జరుగుతాయన్నారు. ప్రతిభ కనబరిచిన వారిని ఆగస్టు 7, 8 తేదీలలో ఆదిలాబాద్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వివరాలకు బాలశేఖర్ 94400 31945, సంగీత 9849420803, రఘువీర్ 9849444941 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

శ్రావణ శోభ



పవిత్ర శ్రావణ మాసం ప్రారంభం కావడంతో జిల్లాలోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మొదటి శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిజామాబాద్ నగరంలోని హమాల్‌వాడి సంతోషిమాత ఆలయంలో అమ్మవారు శాకాంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.
– నిజామాబాద్ రూరల్

అభివృద్ధికి అడుగులు..

వచ్చే వారంలో జిల్లాకు రానున్న సీఎం రేవంత్ !
- రూ.వెయ్యి కోట్లకుపైగా అభివృద్ధి పనుల శంకుస్థాపనకు రంగం సిద్ధం
- మోడల్ స్కూళ్లు.. అమృత్ స్కీమ్‌లకు..
- ప్రాణహిత – చేవెళ్ల పథకానికి నిధులు ప్రకటించే అవకాశం..
- టీయూలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుపై చిగురిస్తున్న ఆశలు
- పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



రెంజల్ మండలంలో పామాయిల్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేసే స్థలాన్ని పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చే వారం జిల్లాలో పర్యటించనున్నట్లు సమాచారం. సుమారు రూ.వెయ్యి కోట్లకుపైగా విలువైన వివిధ అభివృద్ధి పనులకు సీఎం శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహం నెలకొంది. పామాయిల్ సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తుండడంతో జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు భారీగా పెరుగుతోంది. మరో ఏడాది తరువాత నుంచి జిల్లాతోపాటు చుట్టుపక్కల జిల్లాల్లో పామాయిల్ దిగుబడి చేతికి రానుంది. దీంతో క్రషింగ్ కోసం రెంజల్ మండలంలో ఫ్యాక్టరీ ఏర్పాటుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందుకు సంబంధించి బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి శుక్రవారం స్థలాన్ని పరిశీలించారు. సుమారు 120 ఎకరాల విస్తీర్ణంలో ఫ్యాక్టరీ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రీ యూనిక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సుమారు రూ.100 కోట్ల వ్యయంతో ఫ్యాక్టరీ నిర్మాణానికి రంగం సిద్ధం చేస్తున్నారు. నిజాం షుగర్స్ మూతపడిన తరువాత దెబ్బతిన్న ఎకానమీని పునరుద్ధరించే లక్ష్యంతో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణం కోసం పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లారు. చెరుకు సాగుకు రైతులు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం రైతులకు చేయూతనిస్తోంది. దీంతో జిల్లాలో పామాయిల్ సాగు రోజురోజుకూ పెరుగుతోంది. జిల్లాలో ఇప్పటికే 6వేల ఎకరాల్లో ఆయిల్‌పామ్ సాగవుతోంది. వచ్చే ఏడాదికి 15వేల ఎకరాలకు పెరుగనుంది. నాలుగో ఏడాది నుంచి 30 ఏళ్ల వరకు పామాయిల్ దిగుబడి వస్తుంది. అదేవిధంగా నాలుగేళ్లవరకు అంతరపంటలు సాగు చేసుకోవచ్చు. దీంతో రైతులు ఆయిల్‌పామ్ వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదిలా ఉండగా ఫ్యాక్టరీ నిర్మాణం చేయనున్న స్థలానికి ఇప్పటికే రోడ్డు వేయగా, సుదర్శన్‌రెడ్డి స్థలాన్ని పరిశీలించారు. సీఎం రేవంత్ ఫ్యాక్టరీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా రూ.600 కోట్లతో బోధన్, నిజామాబాద్ రూరల్, ఆర్మూర్ మండలాల్లోని మోడల్ స్కూళ్ల భవనాల నిర్మాణానికి, బోధన్, ఆర్మూర్ పట్టణాల అమృత్ స్కీం పనులకు సైతం ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

ఇంజనీరింగ్ కళాశాల..
తెలంగాణ యూనివర్సిటీలో ఇంజినీరింగ్ కళాశాల ఏర్పాటుకు సైతం ప్రభుత్వం సూత్రప్రాయంగా అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. కేబినెట్ ఆమోదిస్తే ఈ ఏడాదే నాలుగు కోర్సులతో తరగతులను ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే భూపతిరెడ్డి తెలిపారు. ఇదిలా ఉండగా నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాలను సైతం టీయూ పరిధిలోకి తీసుకువచ్చేలా సీఎంను కోరామన్నారు.

21వ ప్యాకేజీకి నిధులు..
నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని ప్రాణహిత–చేవెళ్ల 21వ ప్యాకేజీకి సంబంధించిన పనులకు ముఖ్యమంత్రి నిధులు ప్రకటించనున్నట్లు సమాచారం. మంచిప్ప ఏరియాలో ముంపు సమస్య లేకుండా 0.8 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతోనే గతంలో ప్రతిపాదించిన 2 లక్షల ఎకరాల ఆయకట్టు తగ్గకుండా నిర్మాణం చేయనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి తెలిపారు. మెంట్రాజ్‌పల్లి వరకు గ్రావిటీతో, గడ్కోల్‌కు లిఫ్ట్ ద్వారా నీటిని తరలించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగవుతుందని ఎమ్మెల్యే తెలిపారు. కొత్తగా 1.20 లక్షల ఎకరాల ఆయకట్టు, నిజాంసాగర్ టెయిల్‌ఎండ్ పరిధిలో 80వేల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు సీఎం అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తోంది.





శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసముంటున్న వారితో మాట్లాడుతున్న మున్సిపల్ అధికారులు

పురాతన ఇళ్లపై నజర్

- వర్షాల నేపథ్యంలో బల్దియా అప్రమత్తం
- నిజామాబాద్‌నగరంలో 120 శిథిల ఇళ్ల గుర్తింపు
- కూల్చివేయాలని యజమానులకు నోటీసులు
- ఖాళీ చేయాలంటున్న అధికారులు

నిజామాబాద్ సిటీ : అసలే వానాకాలం.. ఆపై పురాతన భవనాలు ఆందోళన కలిగిస్తున్నాయి. కురుస్తున్న వర్షాలతో మట్టితో నిర్మించిన పాత ఇళ్లు తడుస్తూ కొద్దికొద్దిగా కూలుతున్నాయి. ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకముందే బల్దియా అధికారులు అప్రమత్తమయ్యారు. పురాతన (శిథిల) భవనాలపై దృష్టి సారించారు. కార్పొరేషన్ పరిధిలో కూలడానికి సిద్ధంగా 120 ఇళ్లను గుర్తించారు.

వందల సంఖ్యలో పురాతన ఇళ్లు..

కార్పొరేషన్‌లోని పాత ఇందూరులో పురాతన ఇళ్లు ఎక్కువగా ఉన్నాయి. దుబ్బ, బురుడుగల్లీ, కోటగల్లీ, శివాజీనగర్, వినాయక్‌నగర్, జెండాగల్లీ, గాజుల్‌పేట్, కంఠేశ్వర్, శివాజీనగర్, బ్రహ్మపురి కాలనీ, పూసలగల్లీ, బొబ్బిలి వీధి, కసాబ్‌గల్లీ, ఫులాంగ్, పెద్దబజార్, అర్సపల్లిల్లో వందల సంఖ్యలో ఉన్నాయి. వీటిలో కొన్ని ఇప్పటికే శిథిలావస్థకు చేరి పాక్షికంగా ధ్వంసమయ్యాయి. అయితే కొన్నింటిలో మాత్రం ఇప్పటికీ జనం నివసిస్తున్నారు. ప్రమాదం అని తెలిసినా సెంటిమెంట్‌తో వాటిని ఖాళీ చేయడం లేదు. గోడలకు తాత్కాలిక మరమ్మతులు చేయిస్తూ వాటిలోనే నివసిస్తున్నారు. పెంకుటిళ్లు కూలిపోతున్నా పాలిథిన్, టార్పాలిన్లు కప్పుకొని అందులోనే నివసిస్తున్నారు.

పాత ఇళ్లకు నోటీసులు..
నగరంలో ఉన్న పురాతన భవనాలను గుర్తించి నోటీసులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ ఆదేశించారు. దీంతో బల్దియా అధికారులు పాత భవనాలను గుర్తించేపనిలో నిమగ్నమయ్యారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి చెందిన ఇద్దరు ఏసీపీలు, ఇద్దరు టీపీఎస్‌లతోపాటు ఆరుగురు టీపీబీవోలు నగరంలో పర్యటిస్తూ పాత భవనాలను గుర్తిస్తున్నారు. వెంటనే కూల్చివేయాల్సిన వాటి యజమానులకు నోటీసులు అందజేస్తున్నారు. సురక్షిత ప్రాంతాలకు వెళ్లేలా అవగాహన కల్పిస్తున్నారు.

ఖాళీ చేయాలి



నగరంలోని పురాతన ఇళ్లను గుర్తించాం. వరుసగా కురుస్తున్న వర్షాలకు పాత ఇళ్లు కూలిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటి వరకు 120 ఇళ్లను గుర్తించాం. ఖాళీ చేయాలని నోటీసులు ఇచ్చాం. ప్రమాదం జరగక ముందే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి. – టీ శ్రీనివాస్, ఏసీపీ

స్థానికంలో మనదే గెలుపు



మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన ఎమ్మెల్సీ దేశపతి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

- అన్ని వర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- లింగంపేటలో ఆత్మగౌరవ గర్జన సక్సెస్

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి/లింగంపేట : ''కాంగ్రెస్ అన్ని వర్గాలను మోసం చేసింది. పాలిచ్చే బర్రెను వదిలేసి తన్నే దున్నపోతును తెచ్చుకున్నమని ప్రజలు బాధపడుతుండ్రు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ప్రజల్లోకి తీసుకువెళితే 'స్థానిక' ఎన్నికల్లో మనదే విజయం'' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. లింగంపేట అంబేడ్కర్ చౌక్‌లో నిర్వహించిన ఆత్మగౌరవ గర్జన సభలో ఆయన మాట్లాడారు. అంబేడ్కర్ జయంతి రోజున స్థానిక దళిత నాయకుడు సాయిలును ప్రభుత్వ ఆదేశాలతో పోలీసులు అవమానించారంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎల్లారెడ్డి అభివృద్ధి ప్రదాతగా చెప్పుకుంటున్న స్థానిక ఎమ్మెల్యే అమెరికా నుంచి ఏమైనా నిధులు తీసుకువచ్చిండా అని ప్రజలను ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు మోసపోయాయని, అందరూ కసితో ఉన్నారని ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వకుండా తప్పించుకున్న సర్కారు.. ఇప్పుడు సన్న వడ్లకూ ఇవ్వడం లేదని విమర్శించారు.

తమ ప్రభుత్వ హయాంలో కరోనాలాంటి సమయంలో కూడా సంక్షేమ పథకాలు ఏ ఒక్కటీ ఆగలేదని పేర్కొన్నారు. పాలించడం చేతగాక ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని విమర్శించారు. 22 లక్షల మంది కౌలు రైతులకు రైతుబంధు ఇస్తానని చెప్పి వాళ్లను కూడా మోసం చేశారన్నారు. కేసీఆర్ 1,022 గురుకులాలు ఏర్పాటు చేసి, 6.50 లక్షల మంది విద్యార్థులకు సన్నబువ్వ పెట్టి, నాణ్యమైన చదువు చెప్పిస్తే.. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం మాత్రం విద్యార్థుల ప్రాణా లు బలితీసుకుంటోందని ఆరోపించారు. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు సురేందర్, గంప గోవర్ధన్, హన్మంత్ సింధే, బాజిరెడ్డి, జనార్దన్‌గౌడ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు ముజీబొద్దీన్, జెడ్పీ మాజీ చైర్మన్ దఫేదర్ రాజు తదితరులున్నారు.

గుండెపోటుతో ఇరిగేషన్ ఏఈఈ మృతి



నితిన్(ఫైల్)

కమ్మర్‌పల్లి : విధి నిర్వహణలో ఇరిగేషన్ ఏఈఈ నితిన్(30) శుక్రవారం సాయంత్రం గుండెపోటుతో మృతి చెందారు. ఉన్నతాధి కారుల ఆదేశాల మేరకు కమ్మర్‌పల్లి మండలం కోనాపూర్‌లోని రాళ్లవాగులో చెక్‌డ్యామ్‌ల నిర్మాణానికి తోటి సిబ్బందితో కలిసి లెవల్స్ తీస్తుండగా నితిన్ కుప్పకులాడు. సమాచారం అందుకున్న ఎస్సై అనిల్‌రెడ్డి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హైదరాబాద్‌కు చెందిన నితిన్ 2024 అక్టోబర్‌లో ఏఈఈగా ఉద్యోగం సాధించాడు. నెల రోజుల క్రితమే వివాహమైంది.

ఆర్థిక భారమైనా.. సన్నబియ్యం పంపిణీ

అర్హులందరికీ రేషన్‌కార్డులిస్తాం
- పకడ్బందీగా వెరిఫికేషన్
- నాలుగైదు రోజుల్లో జిల్లాకు సీఎం రాక
- మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి
- బోధన్, సాలూర మండలాల్లో కార్డుల పంపిణీ



సాలూర మండల కేంద్రంలో లబ్ధిదారులకు రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, పాల్గొన్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, సబ్ కలెక్టర్ వికాస్ మహతో

బోధన్ : ఉన్నతస్థాయి వారితో సమానంగా పేదలు సైతం సన్నబియ్యంతో భోజనం చేయాలనే సంకల్పంతో సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భారాన్ని భరిస్తూ సన్నబియ్యం పంపిణీ చేస్తోందని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే పొద్దుటూరి సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోధన్ పట్టణంలోని లయన్స్ కంటి ఆస్పత్రి ఆడిటోరియం హాల్, సాలూరాలోని టీటీడీ కల్యాణ మండపంలో రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ మండలానికి చెందిన 665 మందికి, సాలూరాకు చెందిన 108 మందికి నూతన రేషన్‌కార్డులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి రేషన్‌కార్డు ఇస్తామన్నారు. పేదల అభ్యున్నతి, వారి సొంతింటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తోందన్నారు. జిల్లాలోని ప్రభుత్వ బడుల్లో మౌలిక సౌకర్యాల కల్పనకు రూ.22 కోట్లు వెచ్చిస్తున్నామన్నారు. అలాగే బోధన్ ప్రాంతంలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నెలకొల్పేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు స్థలాన్ని పరిశీలించామని తెలిపారు. వరికి ప్రత్యామ్నాయంగా అధిక లాభదాయకమైన ఆయిల్ పామ్ పంట సాగు వైపు దృష్టిసారించాలని రైతులకు సూచించారు. జిల్లాకు నాలుగైదు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి రానున్నారని, రూ.1000 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడతారని తెలిపారు. కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి మాట్లాడు తూ.. అర్హులకు రేషన్‌కార్డుల జారీ నిరంతర ప్రక్రియ అని అన్నారు. జిల్లాలో 11,852 కొత్త రేషన్‌కార్డులు, 84,232 మంది కొత్త సభ్యుల పేర్లను జాబితాలో చేర్చినట్లు వివరించారు.

సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్, డీఎస్‌వో అర్వింద్ రెడ్డి, సివిల్ సప్లయీస్ డీఎం శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ చీల శంకర్, సాలూర తహసీల్దార్ శశిభూషణ్, ఎంపీడీవో శ్రీనివాస్, టీపీసీసీ డెలిగేట్ గంగాశంకర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మందర్నా రవి, నాగేశ్వర్‌రావు, పాషామోహినొద్దీన్, సాలూర సొసైటీ చైర్మన్ అల్లె జనార్దన్, నాయకులు అల్లె రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ
- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి



రేషన్‌కార్డులు అందజేస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి తెలిపారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని కేఎన్‌ఆర్ గార్డెన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే రేషన్‌కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..

రూరల్ నియోజకవర్గంలో 16,116, డిచ్‌పల్లి మండలంలో 3,270 రేషన్‌కార్డులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ఒక్క రేషన్‌కార్డు కూడా మంజూరు చేయ లేదని విమర్శించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పేదలకు సన్న బియ్యం ఇవ్వడం లేదని విమర్శించారు. అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, ఆర్డీవో రాజేంద్రకుమార్, తహసీల్దార్ సతీశ్ రెడ్డి, మండల ప్రత్యేకాధికారి యోహాన్, టీపీసీసీ జనరల్ సెక్రెటరీ కే నగేశ్‌రెడ్డి, పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్, ఐడీసీఎంఎస్ మాజీ చైర్మన్ తారాచంద్, డీసీసీబీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అమృతాపూర్ గంగాధర్, డీసీసీ డెలిగేట్స్ వాసుబాబు, ధర్మాగౌడ్, శ్యాంసన్, సొసైటీ చైర్మన్లు రాంచందర్‌గౌడ్, గంగారెడ్డి, మాజీ ఎంపీపీలు కంచెట్టి గంగాధర్, నర్సయ్య పాల్గొన్నారు.

అందుబాటులో సరిపడా ఎరువులు

- రైతులు ఆందోళన చెందొద్దు
- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- ఎడపల్లి సొసైటీ ఎరువుల గోదాం తనిఖీ



ఎడపల్లిలో ఎరువుల నిల్వలను పరిశీలించి చైర్మన్ మల్కారెడ్డితో మాట్లాడుతున్న కలెక్టర్

బోధన్ : వానాకాలం సీజన్ పంటల సాగుకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులెవరూ ఆందోళన చెందొద్దని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. ఎడపల్లి మండల కేంద్రంలో పీఏసీఎస్ ఎరువుల గోదాంను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలను పరిశీలించారు. ఎరువుల కోసం వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. సరిపడా ఎరువులు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. జిల్లాలో ప్రస్తుతం 11వేల మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, ప్రతి రెండ్రోజులకు ఒకసారి ఎరువుల స్టాక్ వస్తోందన్నారు. రైతులకు ఎరువులు అందేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. వరికి ప్రత్యామ్నాయంగా అధిక లాభాలు అందించే ఆయిల్ పామ్ సాగు వైపు దృష్టి సారించాలని రైతులకు సూచించారు. కలెక్టర్ వెంట సొసైటీ చైర్మన్ పోల మల్కారెడ్డి, ఉద్యోగులున్నారు.

మరమ్మతులు చేయించాలి

పట్టణ కేంద్రంలోని బోధన్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని కలెక్టర్ సందర్శించారు. ఆస్పత్రి భవనం లీకేజీలు, ఫ్లోరింగ్ వంటి సమస్యలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని అధికారులను ఆదేశించారు. రోగులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కలెక్టర్‌ను కలిసిన డేటా ఆపరేటర్లు
సాలూర మండల కేంద్రంలో కొత్తరేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డిని కులగణన సర్వే డేటా ఎంట్రీ ఆపరేటర్లు కలిశారు. ప్రభుత్వం నుంచి పారితోషికం ఇప్పించాలని కోరారు.

సబ్ కంట్రోల్ పునరుద్ధరణ

- ప్రధాన జంక్షన్‌లలో ఏఐ టెక్నాలజీ సీసీ కెమెరాలు
- నిజామాబాద్ నగరంలో పర్యటించిన సీపీ సాయిచైతన్య



బస్టాండ్ వద్ద సబ్ కంట్రోల్ రూంను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి : నిజామాబాద్ నగరంలోని ప్రధాన జంక్షన్‌లలో పోలీస్ సబ్ కంట్రోల్ రూమ్‌లను పునరుద్ధరించనున్నట్లు పోలీస్ కమిషనర్ పి సాయిచైతన్య తెలిపారు. గతంలో నగరంలోని ఆర్టీసీ బస్టాండ్, బోధన్ బస్టాండ్, అర్సపల్లి చౌరస్తా, చార్ భాయ్ పెట్రోల్ బంక్, వీక్లి మార్కెట్, కంఠేశ్వర్ చౌరస్తా తదితర ప్రాంతాల్లో కొనసాగిన సబ్ కంట్రోల్ రూమ్‌లను సీపీ శుక్రవారం రాత్రి పరిశీలించారు. సబ్ కంట్రోల్ రూమ్‌లను వాడకంలోకి తీసుకువచ్చేలా అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ట్రాఫిక్ నియంత్రణ కోసం ఆయా జంక్షన్‌లలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. అవసరమైన ప్రాంతాల్లో కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా, స్టాప్ లైన్‌ల ఏర్పాటు, ఫ్రీ లెఫ్ట్ కార్యాచరణ రూపొందించాలని, హనుమాన్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్‌ను పునరుద్ధరించాలని ఆదేశించారు. సీపీ వెంట ట్రాఫిక్ ఏసీపీ సయ్యద్ మస్తాన్ అలీ, సీఐ పి ప్రసాద్, ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి, రిజర్వ్ సీఐ (వెల్ఫేర్) తిరుపతి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

తిర్మన్‌పల్లిలో ఒకరికి డెంగీ

ఇందల్వాయి: మండలంలోని తిర్మన్‌పల్లి గ్రామానికి చెందిన రామరాజు అనే వ్యక్తికి డెంగీ నిర్ధారణ అయినట్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు క్రిస్టినా శుక్రవారం తెలిపారు. నాలుగు రోజులుగా అతడు జ్వరంతో బాధపడుతుండటంతో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగీ పాజిటివ్ వచ్చిందన్నారు. వెంటనే అధికారులు బాధితుడిని ఆస్పత్రికి తరలించి, గ్రామంలో పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. గ్రామంలో డీఎల్‌పీవో శ్రీనివాస్, ఎంపీడీవో అనంతరావు, తహసీల్దార్ వెంకటరావు వైద్య సిబ్బంది పర్యటించి గ్రామస్తులకు డెంగీ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. పంచాయతి కార్యదర్శి శ్రీధర్, కారోబార్ నరేందర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పీజీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): ఈ నెల 24 నుంచి ప్రారంభం కావాల్సిన పీజీ, ఇంటిగ్రేటెడ్ పీజీ, ఎల్ఎల్‌బీ సెమిస్టర్ పరీక్షలను విద్యార్థుల వినతి మేరకు వాయిదా వేసినట్లు కంట్రోలర్ సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ, ఎల్ఎల్‌బీ 6వ సెమిస్టర్ రెగ్యులర్ /బ్యాక్‌లాగ్, ఎల్ఎల్‌బీ, ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ కోర్సులు ఐఎంబీఏ, ఏపీఈ, ఐపీసీహెచ్ 5వ సెమిస్టర్, ఏపీఈ, ఐపీసీహెచ్ 7, 9వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ థియరీ పరీక్షలకు ఈ షెడ్యూల్ వర్తిస్తుందన్నారు. జూలై 31 నుంచి ఆగస్టు 14వరకు పరీక్షలు జరుగుతాయని కంట్రోలర్ తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

కవితా తోరన్‌కు జియో స్పేసియల్ ఫ్యాకల్టీ అవార్డు



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ విశ్వవిద్యాలయంలోని జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కవితా తోరన్ ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సంస్థ జియో స్పేసియల్ ఫ్యాకల్టీ అవార్డు అందుకున్నారు. ఈ నెల 23న ఇస్రో మాజీ డైరెక్టర్ కిరణ్ కుమార్ చేతుల మీదుగా కవితా తోరన్ అవార్డు అందుకున్నారు. ఈ అవార్డును దేశవ్యాప్తంగా 22 మంది శాస్త్రవేత్తలకు అందజేశారు. ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్న కవితా తోరన్‌ను శుక్రవారం తెయూ వీసీ ప్రొఫెసర్ యాదగిరిరావు అభినందించారు. ఈ అవార్డు తెయూకు గర్వకారణమని పేర్కొన్నారు.

వేలల్లో దరఖాస్తులు.. పదుల్లో యూనిట్లు

- దివ్యాంగులకు స్వయం ఉపాధి కోసం రాయితీ రుణాలను అందిస్తోన్న ప్రభుత్వం
- జిల్లాలో ప్రతియేటా వేలాది మంది దరఖాస్తు చేసుకుంటున్న వైనం
- పంపిణీకి మాత్రం అరకొర యూనిట్లే మంజూరు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న దివ్యాంగులు

మోర్తాడ్(బాల్కొండ): దివ్యాంగులకు స్వయం ఉపాధిని కల్పించడానికి, వ్యాపార వృద్ధికి ఆర్థిక చేయూతను అందించడానికి ప్రతియేటా రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రుణాలను అందిస్తోంది. ఈక్రమంలో ప్రస్తుత సంవత్సరం (2025–26)కు గాను దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రతిసారి జిల్లావ్యాప్తంగా వేలాది మంది దివ్యాంగులు రుణం కోసం దరఖాస్తు చేసుకోగా, పదుల సంఖ్యలోనే లబ్ధిదారులను ఎంపిక చేసి రాయితీరుణం అందిస్తోంది. దీంతో రుణం దక్కని దరఖాస్తుదారులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యూనిట్ల సంఖ్య పెంచితేనే..

2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను దివ్యాంగులకు ఇచ్చే రుణ లక్ష్యంను ప్రభుత్వం నిర్దేశించింది. ఇందులో 33 యూనిట్లకు రూ.50వేల చొప్పున వంద శాతం రాయితీతో సాయం అందించనున్నారు. మిగిలిన మూడు యూనిట్లకు బ్యాంకు లింకేజీ ద్వారా రుణం అందించి సబ్సిడీని వర్తింపచేయనున్నారు. మొత్తం 36 యూనిట్లకు రాయితీ కోసం ప్రభుత్వం రూ.20.50 లక్షలను కేటాయిస్తూ నిర్ణయించింది. వంద శాతం రాయితీ కోసం రూ.16.50 లక్షలు, బ్యాంకు లింకేజీ రుణాలకు రాయితీ కోసం రూ.4లక్షలను కేటాయించారు. జిల్లాలో స్వయం ఉపాధి పొందుతున్న దివ్యాంగుల సంఖ్య వేలల్లో ఉంటే రాయితీ రుణాలను మాత్రం 36 మందికే మంజూరు చేయనున్నారు. ప్రతి ఏటా పదుల సంఖ్యలోనే యూనిట్లకు రాయితీ అందిస్తుండటంతో దివ్యాంగులు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. కనీసం ప్రతి ఏటా వంద మందికి రుణ సదుపాయం కల్పిస్తూ పోతే దివ్యాంగులైన నిరుద్యోగులకు ఎంతో ఆసరాగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ప్రభుత్వం స్పందించి దివ్యాంగులకు ఇచ్చే రాయితీ యూనిట్ల సంఖ్యను పెంచాలని పలువురు కోరుతున్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి మోర్తాడ్ మండలం శెట్పల్లికి చెందిన తంగళ్లపల్లి చిరంజీవి. ఇతడు పుట్టుకతోనే అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. కూల్‌డ్రింక్స్, జిరాక్స్ సెంటర్‌తో పాటు మొబైల్ ఫోన్లను రిపేర్ చేస్తూ స్వయం ఉపాధి పొందుతున్నాడు. దివ్యాంగులకు ఇచ్చే రాయితీ రుణం తనకు అందితే తన వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలని భావించాడు. 2021 నుంచి ప్రతి ఏటా దివ్యాంగులకు ఇచ్చే వంద శాతం రాయితీ రుణం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటున్నా, అతనికి ఇప్పటి వరకూ ఎలాంటి సాయం అందలేదు. ఇది ఒక్క చిరంజీవికే కాకుండా ఎంతో మంది దివ్యాంగులకు ఎదురవుతున్న చేదు అనుభవం.



చిన్నచూపు తగదు..



ప్రభుత్వం దివ్యాంగులపట్ల చిన్న చూపు చూడటం తగదు. దివ్యాంగులకు ప్రతి ఏటా పదుల సంఖ్యలోనే రాయితీ రుణాలను అందిస్తున్నారు. వేల సంఖ్యలో దివ్యాంగులు ఉంటే పదుల సంఖ్యలో యూనిట్లను మంజూరి చేయడం ఎంత వరకు సమంజసం. వెంటనే యూనిట్ల సంఖ్యను పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. – సుజాత సూర్యవంశీ, వికలాంగుల హక్కుల సమితి జాతీయ అధ్యక్షురాలు

బాధితులకు అండగా భరోసా కేంద్రం

- సీపీ సాయిచైతన్య



ఖలీల్‌వాడి: బాధిత మహిళలు, పిల్లలకు సహాయం అందించడంతోపాటు మెరుగైన సేవలు అందిస్తూ భరోసా కేంద్రం అండగా నిలుస్తోందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయం వద్ద ఉన్న భరోసా కేంద్రంలో నమోదైన పోక్సో, రేప్ కేసులలోని ఏడుగురు బాధిత పిల్లలు, మహిళలకు భరోసా కేంద్రం తరఫున చెక్కులను శుక్రవారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ భరోసా కేంద్రం ద్వారా మహిళలకు మనోధైర్యం, న్యాయం అందించడం పోలీస్ శాఖ ముఖ్య లక్ష్యాలలో ఒకటన్నారు. కార్యక్రమంలో డీసీపీ(అడ్మిన్) బస్వారెడ్డి, భరోసా సెంటర్ కో–ఆర్డినేటర్ జీ రోజా, లీగల్ అడ్వయిజర్ దయాణ గీతిక, మహిళా పీఎస్ ఎస్సై పుష్పావతి, మౌనిక, సవిత తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర గ్రంథాలయానికి నూతన భవనం

నిజామాబాద్ అర్బన్: నగరంలోని జిల్లా కేంద్ర గ్రంథాలయానికి రూ.3కోట్లతో నూతన భవన నిర్మాణం చేపట్టాలని పాలకవర్గం తీర్మానించింది. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శుక్రవారం సంస్థ అధ్యక్షుడు అంతి రెడ్డి రాజిరెడ్డి అధ్యక్షతన పాలకవర్గ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఏర్పడిన నూతన మండలాల్లో శాఖ గ్రంథాలయాలు ఏర్పాటు చేయుటకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ఆర్మూరు శాఖ గ్రంథాలయంలో పాఠకులు అధికంగా వస్తున్నందున పనివేళలను మరో ఆరు గంటలు పొడిగించామన్నారు. అన్ని గ్రంథాలయాల్లో పాఠకుల సౌకర్యం కోసం మౌలిక వసతులను ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసినట్లు తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఖాతాదారులతో మర్యాదగా ప్రవర్తించాలి



డిచ్‌పల్లి సహకార బ్యాంకులో రికార్డులను తనిఖీ చేస్తున్న డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి

డిచ్‌పల్లి: సహకార బ్యాంకుకు వచ్చే ఖాతాదారులతో సిబ్బంది మర్యాదగా మెలగాలని, పారదర్శకంగా సేవలందించి వారి మన్ననలు పొందాలని నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి సూచించారు. డిచ్‌పల్లి మండల కేంద్రంలోని సహకార బ్యాంకును శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బందితో ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారులకు బ్యాంకు లాకర్స్, రుణాలు, డిపాజిట్ సదుపాయాల గురించి అవగాహన కల్పించాలన్నారు. భవిష్యత్‌లో నకిలీ బంగారం అని తేలినా, రుణ మంజూరు ప్రక్రియలో లోపాలు గుర్తించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రమేష్‌రెడ్డి, డైరెక్టర్ ఆనంద్‌లను బ్రాంచ్ మేనేజర్ శ్రావణ, ఫీల్డ్ ఆఫీసర్ మోహన్‌రెడ్డి, అసిస్టెంట్ మేనేజర్ సునీత సత్కరించారు. క్యాషియర్ ప్రసన్నకుమారి, స్టాఫ్‌అసిస్టెంట్ మునీర్‌ఖాన్, విశ్వనాథ్, అటెండర్ రమేష్ పాల్గొన్నారు.

కొత్త పెన్షన్ చట్టాన్ని రద్దు చేయాలి



నగరంలో నిరసన వ్యక్తం చేస్తున్న పెన్షనర్లు

నిజామాబాద్ నాగారం: కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు వ్యతిరేకంగా రూపొందించిన కొత్త పెన్షన్ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నిజామాబాద్ జిల్లా కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. జాతీయ పెన్షనర్ల కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం వారు ఎన్టీఆర్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేశారు. జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు మాట్లాడుతూ.. మధ్యతరగతి ఉద్యోగుల పొట్ట కొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఇలాంటి చట్టాలు తీసుకొస్తుందని, దీనికి వ్యతిరేకంగా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. నాయకులు మదన్మోహన్, శిరప హనుమాండ్లు, రాధా కిషన్, జార్జి, పురుషోత్తం, ప్రతాపరెడ్డి, హుస్సేన్, పుష్పవల్లి, లలిత, మేరీ, ప్రసాద్, వెంకట్రావు, సిర్ప లింగయ్య పాల్గొన్నారు.

ఏపీఎంల బదిలీలు పూర్తి

- కలెక్టరేట్‌లో 31 మందికి కౌన్సెలింగ్ నిర్వహించిన కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి
- నేడు పోస్టింగ్ ఆర్డర్లు

డొంకేశ్వర్(ఆర్మూర్) : గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్)లో పనిచేస్తున్న ఏపీఎంల బదిలీలు పూర్తయ్యాయి. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధ్యక్షతన బదిలీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సెర్ప్ నుంచి వచ్చిన సీనియారిటీ లిస్టు ప్రకారం ఏపీఎంలకు కౌన్సెలింగ్ చేపట్టి కోరుకున్న మండలాలకు బదిలీలు చేశారు. బదిలీలు పారదర్శకంగా జరగడంతో ఏపీఎంలు సంతృప్తి వ్యక్తం చేశారు. మొత్తం 31 మందిని బదిలీ చేయగా, శనివారం పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వనున్నారు. నెలాఖరుకు రిలీవ్ అయ్యి ఆగస్టు 1న కొత్త మండలాల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుంది. కాగా, కొత్త మండలాలైన డొంకేశ్వర్, ఆలూరు, పొతంగల్, సాలూరలకు ఏపీఎంలను నియమించలేదు. బదిలీల్లో భాగంగా కొత్త మండలాలకు ఏపీఎంలను కేటాయించాలని డీఆర్డీవో, సెర్ప్ సీఈవోకు ఇటీవల లేఖ రాసినా ఫలితం లేకుండా పోయింది. కౌన్సెలింగ్‌లో డీఆర్డీవో సాయాగౌడ్, ఏపీడీ మధుసూదన్ ఉన్నారు.



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి, పక్కన డీఆర్డీవో సాయాగౌడ్

అధికారి	కేటాయించిన	భూమేశ్వర్ గౌడ్	ఆర్మూర్	గడ్డం హిమబాల	ముప్కాల్
పేరు	మండలం	ఎంఏ ముఖీమ్	ఎస్బీఈపీ బోధన్	బొర్ర గంగాధర్	చందూర్
యెలవర్తి సరళ	ని. రూరల్	రవీందర్ రెడ్డి	డిచ్‌పల్లి	కుంట గంగాధర్	ఏర్గట్ల
వి.సరోజిని	మోపాల్	పుప్పాల గంగాధర్	జక్రాన్‌పల్లి	మెట్టు సువర్ణ	సిరికొండ
అనిల్‌కుమార్	డీఎంఎంయూ	కె. గంగాధర్	నందిపేట్	ఎస్. మోహన్	రెంజల్
సీహెచ్ ప్రమీల	భీమ్‌గల్	మహేశ్ కుమార్	నవీపేట్	చిలుక రాజేందర్	ఎడపల్లి
బి. గంగారాం	బాల్కొండ	డి.శ్యామ్	మోర్తాడ్	ఉర్నాల చిన్నయ్య	ధర్పల్లి
ప్రసాద్‌రావు	డీఎంఎంయూ	బి.మాణిక్యం	వేల్పూర్	జి.కిరణ్ కుమార్	కమ్మర్‌పల్లి
బోలిశెట్టి ఉమాకిరణ్	మాక్లూర్	ఈ.సునీత	ఇందల్వాయి	ఈ. మనోహర్	వర్ని
బస్వాంత్ రావు	రుద్రూర్	కె. రవికుమార్	డీఎంఎంయూ	గంగారాజు	మెండోరా
చిన్నోళ్ల సాయిలు	బోధన్	ఎస్.గంగాధర్	మోస్రా	జి. భాస్కర్	కోటగిరి

క్రైం కార్నర్

సెక్యూరిటీ గార్డ్‌పై దాడి



మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ మార్కెట్ కమిటీ చెక్‌పోస్టులో విధులు నిర్వహిస్తున్న సెక్యూరిటీ గార్డ్ బట్టు నరేష్‌పై గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌పై వచ్చి దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. బాధితుడు వారి నుంచి తప్పించుకొని పారిపోయి ప్రాణాలు కాపాడుకున్నట్లు శుక్రవారం తెలిపారు. ఈవిషయమై మాక్లూర్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. దాడి దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డవడంతో పోలీసులు వాటిని పరిశీలించారు. నిందితుల బైక్ నంబర్ సహాయంతో వారి పూర్తి వివరాలు తెలుసుకున్నారు. ఇద్దరు నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలిస్తున్నట్లు తెలిసింది.

ఇద్దరిపై కేసు నమోదు

రుద్రూర్: అదనపు కట్నం కోసం వేధించిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు కోటగిరి ఎస్సై సునీల్ తెలిపారు. వివరాలు ఇలా.. కామారెడ్డి జిల్లా బీర్కూర్ మండలం బరంగెడ్గి గ్రామానికి చెందిన రాజేష్‌తో కోటగిరి మండల కేంద్రానికి చెందిన రజితకు 19ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి కుమారుడు, కూతురు ఉన్నారు. ఇటీవల రజితను అదనపు కట్నం తెమ్మని భర్త రాజేష్, అత్త గంగమణి వేధించి, ఇంట్లో నుంచి పంపించివేశారు. దీంతో బాధితురాలు శుక్రవారం కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మాణిక్‌భండార్‌లో గంజాయి కలకలం

మాక్లూర్: మండలంలోని మాణిక్‌భండార్ శివారులోగల పోచమ్మ ఆలయం సమీపంలో గంజాయి తాగుతున్న 9మంది యువకులను శుక్రవారం పట్టుకుని కేసు నమోదు చేసినట్లు మాక్లూర్ పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారంతా 20 ఏళ్లలోపు వయస్సు ఉన్న యువకులేనని తెలిపారు. గంజాయి ఎక్కడి నుంచి వచ్చింది. ఎవరి వద్ద కొనుగోలు చేశారు. ఎంతకాలంగా ఇలా గంజాయి తాగుతున్నారు అనేది విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

మాక్లూర్: మండలంలోని గుత్ప గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు ఇలా.. గ్రామానికి చెందిన ప్రసాద్ అనే వ్యక్తి గురువారం తన ఇంటికి తాళం వేసి, మరో ఇంట్లో నిద్రించాడు. మరుసటి రోజు ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళం పగలగొట్టి ఉండటంతో చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు సమాచారం అందించారు. మాక్లూర్ పోలీసులకు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్‌టీంతో వేలిముద్రలు సేకరించుకొని వెళ్లారు. దుండగులు ఇంట్లోకి చొరబడి రెండు తులాల బంగారం చోరీ చేసినట్లు బాధితుడు తెలిపారు. ఈ విషయమై ఎస్సై రాజశేఖర్‌ను సంప్రదించే ప్రయత్నం చేయగా ఆయన అందుబాటులోకి రాలేదు.

ఏర్గట్ల ఎస్సైపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: ఏర్గట్ల ఎస్సై, కానిస్టేబుళ్లపై శుక్రవారం బాధితుడు ఏర్గట్లకు చెందిన రాజ్ కుమార్ సీపీ సాయిచైతన్యకు ఫిర్యాదు చేశారు. బాధితుడు తెలిపిన వివరాలు ఇలా.. ఈ నెల 22న అర్ధరాత్రి ఏర్గట్ల మండల కేంద్రంలోని ఓ మంగళి దుకాణంలో షట్టర్ క్లోజ్ చేసి రాజ్‌కుమార్‌తోపాటు మరో ముగ్గురు మద్యం సేవిస్తున్నారు. అయితే ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లు వచ్చి నలుగురిని పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. ముగ్గురిని వివరాలను అడిగి పంపారని, తనను వివరాలు అడిగితే నెలన్నర క్రితం గల్ఫ్ నుంచి వచ్చినట్లు తెలిపారు. అయితే ఎస్సై, కానిస్టేబుళ్లు పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లడానికి డబ్బులు డిమాండ్ చేశారన్నారు. దీనికి ససేమిరా అనడంతో చితకబాదినట్లు చెప్పారు. దీనిపై సీపీకి ఫిర్యాదు చేసినట్లు అతడు పేర్కొన్నాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



సిరికొండ: మండలంలోని మైలారం గ్రామ శివారులో ఆయల కుంట చెరువు కట్ట పక్కన చెట్ల పొదలలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై రామకృష్ణ శుక్రవారం తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 35ఏళ్ల నుంచి 40ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ధర్పల్లి సీఐ భిక్షపతి, ఎస్సై పరిశీలించారు. మైలారం పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గ్రామంలోని సీసీ ఫుటేజీని పోలీసులు పరిశీలించగా ఈ నెల 23న గ్రామంలో నుంచి ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు మృతదేహంతో బైక్‌పై వెళుతున్నట్లు రికార్డయినట్లు తెలిసింది.

డ్రంకెన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు

రెంజల్(బోధన్): మండలంలోని సాటాపూర్ చౌరస్తాలో గురువారం సా యంత్రం పోలీసులు వాహనాల తనిఖీతోపాటు, డ్రంకెన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టారు. ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి, శుక్రవారం కోర్టులో హాజరుపర్చారు. జడ్జి ఇద్దరికి 4రోజుల జైలుశిక్ష విధించినట్లు ఎస్సై చంద్రమోహన్ తెలిపారు.

మంచిప్పలో ఒకరి ఆత్మహత్య



పోశెట్టి (ఫైల్)

మోపాల్: మండలంలోని మంచిప్పలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై సుస్మిత శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. మంచిప్పకు చెందిన ఆలకుంట పోశెట్టి (45) కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది అతడు గురువారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసులో నిందితుడి రిమాండ్

నిజామాబాద్ రూరల్: ఒక వ్యక్తిపై దాడి చేసిన కేసులో షేక్ రెహన్ అనే వ్యక్తిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలు ఇలా.. నెహ్రూనగర్‌కు చెందిన షేక్ అఫ్సర్ అలీ ఈనెల 17న మండలంలోని రాంనగర్ గ్రామంలోని అతడి అక్క ఇంట్లో భోజనం చేస్తున్నాడు. ఈ సమయంలో రాంనగర్‌కు చెందిన షేక్ రెహన్ వ్యక్తిగత కక్షతో అతడి తలపై గాయపరిచాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

బైక్ చోరీ కేసులో..

రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చంద్రశేఖర్ కాలనీకి చెందిన ఎస్‌కె మజీద్‌ను బైక్ చోరీ కేసులో పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. బైపాస్ రోడ్డుపై నిలిచి ఉన్న సుజుకి ఆక్సిస్ మోటార్ సైకిల్‌ను మజీద్ చోరీ చేయగా, ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. పోలీసులు నిందితుడిని గుర్తించి, రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

చిరుత సంచార ప్రాంతాల పరిశీలన



నందిగామ శివారులో చిరుత పాదముద్ర



చిరుత సంచారంపై విచారిస్తున్న అధికారులు

నవీపేట: మండలంలోని నందిగామ, సిరన్‌పల్లి గ్రామాలలో చిరుత సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో ఫారెస్ట్ అధికారులు శుక్రవారం ఆయా ప్రాంతాలను పరిశీలించారు. 15రోజుల కిందట నందిగామ శివారులో చిరుత కనిపించగా, కొందరూ ఫొటో తీశారు. కానీ అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వలేదు. అలాగే రెండు రోజుల కిందట సిరన్‌పల్లి శివారులో మేకల మందపై చిరుత దాడి చేసి ఒక మేకను తీవ్రంగా గాయపర్చింది. ఈ రెండు ఘటనలను కొందరు యువకులు శుక్రవారం సోషల్ మీడియాలో షేర్ చేశారు. దీంతో ఫారెస్ట్ నిజామాబాద్ బీట్ ఆఫీసర్ సుధీర్, సెక్షన్ ఆఫీసర్ జహ్రాలు స్పందించి, రెండు ప్రాంతాలను సందర్శించారు. పాదముద్రలను సేకరించారు. చిరుత సంచారం నిజమేనని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

చిన్నారిని చితకబాదిన వ్యక్తి

- ఆలస్యంగా వెలుగులోకి ఘటన

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లిలో ఓనమాలు రావడం లేదని ఓ వ్యక్తి చిన్నారిని చితకబాదిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మామిడిపల్లి చెందిన ఓ మహిళ తన భర్త చనిపోవడంతో బిడ్డను తీసుకొని ఓ వ్యక్తితో సహజీవనం కొనసాగిస్తుంది. చిన్నారి అంగన్‌వాడీ కేంద్రానికి వెళుతున్నా ఓనమాలు రావడం లేదు. దీంతో నాలుగురోజుల క్రితం సహజీవనం చేస్తున్న వ్యక్తి చిన్నారి శరీరంపై వాతలు పెట్టి చితకబాదాడు. విషయం తెలుసుకున్న చిన్నారి మేనత్త,మేనమామలు గురువారం స్థానిక ఆస్పత్రిలో చికిత్స చేయించారు. సమాచారం అందుకున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి చేరుకొని తల్లిని పిలిపించి విచారించారు. చిన్నారిని పోషించడానికి తల్లి విముఖత తెలపడంతో మేనత్త, మేనమామ వారింటికి తీసుకువెళ్లారు. ఈ విషయమై ఐసీడీఎస్ అధికారులు మాట్లాడుతూ.. చిన్నారిని త్వరలో జిల్లాకేంద్రానికి తరలించి, పోషణ విషయమై కుటుంబసభ్యులతో చర్చిస్తామన్నారు. చిన్నారి బాధ్యతను ఎవరూ తీసుకోకుంటే, ఐసీడీఎస్ తీసుకుంటుందన్నారు.